నాటకం జరిగినరోజు తను అరెస్టు చేసినవాడు! అనంతానంత స్వామి కారు డోర్ తెరిచి పట్టుకున్నవాడు A2.

"మిమ్మల్ని ఎక్కించుకున్నది స్వీట్‌గా పగ తీర్చుకోవడానికి బేబీ, పాపం మీ వాళ్ళంతా మేము మిమ్మల్ని దూరంగా తీసుకువెళ్ళి వదిలేస్తామని అనుకున్నారా?"

ఆమె అనుకోలేదు. అంతకన్నా ఆశ్చర్యం గొలుపుతున్న విషయం ఆమె మనసుని తొలిచేస్తూంది. సూర్యారావు మీద వీళ్ళు హత్యా ప్రయత్నం చేశారు. మళ్ళీ అతడే ముఖ్యమంత్రి అవడానికి ఎలా వప్పుకున్నారు?

అదే అడిగింది.

వాళ్ళు ముగ్గురూ బిగ్గరగా నవ్వేరు.

కారు అడవి మధ్యలో ఆగింది. "దిగండి" అన్నాడు నాయకుడు అందరూ దిగారు.

అనంతానంతస్వామి లీలలు మీకు అర్థంకావు. ముందు సూర్యారావు మీద హత్యాప్రయత్నం చేసినట్టు - తర్వాత అతడిని ముఖ్యమంత్రిని చేసినా ఎవరికీ అనుమానం రాదు..... ప్రజలకి అతడిమీద సానుభూతి వుంటుంది! స్వామి తాలూకు మూడో స్తంభం సూర్యారావే! భాముడు చందమామని అడిగినట్టు, సూర్యారావు స్వామిని ముఖ్యమంత్రి పదవి అడిగాడు. ఏం?.... చావబోయేముందు ఈ రహస్యం షాక్ కలుగచేస్తోందా? మొత్తం ఇదంతా స్వామి ప్లానే... రాజకీయ చదరంగం!"

"పాలిటిక్స్... బ్లడీ పాలిటిక్స్" కసిగా అన్నాడు విహారి.

"పాలిటిక్స్ గురించి స్వర్గంలో ఆలోచిద్దువుగానిలే.... పద" అంటూ ఒకడు విహారిని పక్కగా తోసేడు. విహారి ముందుకు తూలాడు. నీవు వెనుక పిస్టల్ పెట్టి తోసుకుంటూ ప్రవల్లిక నుంచి అతడిని దూరంగా చెట్లచాటుకు తీసుకు వెళ్ళాడు. అడవి అక్కడనుంచి స్లోప్‌గా వుంది. పెద్ద లోయ - అక్కడ ఆపాడు.

"లోయలోకి దూకి ఛస్తావా? పిస్తోలుతో కాల్చి చంపమంటావా?"

నవ్వేడు టెర్రరిస్టు. "...చూశావా నేనెంత మంచివాడినో! నిన్నే ఏది కావాలో కోరుకోమంటున్నాను."

విహారి మాట్లాడలేదు.

"బట్టలు విప్పు-"

విహారి అదిరిపడి చూశాడు.

"నువ్వు చచ్చిన తర్వాత గద్దలకీ, జతువులకీ నీ బట్టలు అడ్డు రాకూడదు. 'పరోపకారార్థం మిదం శరీరం' అన్నారు స్వామి, చూశావా నాకెంత దయాగుణమో---"

వాడో శాడిస్టు అని గ్రహించాడు విహారి, చెప్పిన పని వెంటనే చెయ్యకపోతే మరింత చెలరేగిపోతారు ఇలాంటి వాళ్ళు, నిశ్శబ్దంగా బట్టలన్నీ విప్పి - డ్రాయర్‌తో నిలబడ్డాడు.

విహారి దాన్ని కూడా విప్పేసేడు. ఇలాంటి శాడిస్టులని అతడు కేవలం సినిమాల్లోనే చూసాడు.

"నా పేరేమిటో నీకు తెలుసా? తెలిస్తే గుండాగి ఛస్తావ్" అని మొహంమీద ముసుగు తొలగిస్తూ "నాపేరు రామ్‌లాల్" అన్నాడు.

విహారి స్థబ్దుడయ్యాడు. స్వామి తాలూకు రెండో స్తంభం!!

"ఈ రివాల్వర్‌లో నాలుగు గుళ్ళున్నాయి. అటు తిరిగి చెప్పు. మొదటి దానితో నిన్ను కాలుస్తానా-కాల్చనా?"

విహారి అటు తిరిగాడు. వెనగ్గా పది గజాల దూరంలో రామ్‌లాల్ నిలబడి వున్నాడు. మరణం తప్పదని తెలిసిపోయింది. ".......కాలుస్తావు" అన్నాడు పెదాలు బిగపట్టి.

గుండు గాలిలోకి వెళ్ళింది.

"కాల్చలేదు... హాహ్హా.... కాల్చలేదు. అబద్ధం చెప్పాను. ఈసారి ఛాన్స్ యిస్తున్నాను. అబద్ధం చెపితే కాల్చేస్తాను. అప్పుడు నిన్ను చంపిన పాపం నాకంటదు. అవునా... చెప్పు, ఈసారి కాలుస్తావా లేదా?"

"కాలుస్తావు" అన్నాడు నిజం చెపుతున్నట్టు.

వరుసగా మూడుసార్లు పిస్తోలు పేలింది.

* * * *

ప్రవల్లిక ఇంకా శిలాప్రతిమలాగే నిలబడి వుంది. వాళ్ళు చెప్పిన విషయం ఆమెకో పెద్ద షాక్. వాళ్ళు చెప్పేవరకూ అనంతానంతస్వామి ప్లాను ఇంత గొప్పదని ఆమె వూహించలేదు. ఈ పిల్ల కిడ్నాప్ వెనుక స్వామి వుంటాడన్న అనుమానం ఎవరికీ రానంత గొప్పగా ప్లాన్ వేశాడు. సూర్యారావుమీద హత్యా ప్రయత్నం చేసింది స్వామేనని తనకి తెలుసు. టెర్రరిస్టులు సుర్యారావుని ముఖ్యమంత్రిని చేయమన్నప్పుడు వీళ్ళు అనంతానంతస్వామికి వ్యతిరేకమైన గ్రూపు అనుకుంది. తెర వెనుక ఇంత నాటకం జరిగి వుంటుందని కలలోకూడా వూహించలేదు.

భుజంమీద చెయ్యి పడేసరికి తెలివిలోకి వచ్చింది. A-2 ఆమె వెనగ్గా చెయ్యివేసి వెన్ను నిమురుతున్నాడు. అతడి పెదవులమీద క్రూరమైన నవ్వు కదలాడుతోంది. చేతిని మరింత క్రిందుగా జరిపాడు. ఆమె విదిలించుకోబోయింది. అది ముందే వూహించినట్టు వాడు ఆమె వెన్ను క్రింద భాగంలో బలంగా కొట్టాడు.

ఆమె పారలైజ్ అయింది.

అలాటి - కిక్ గురించి, సిబి.ఐ. ట్రెయినింగ్‌లో నేర్పుతారు. స్పృహ తప్పదు. కానీ భరించలేనంత నిస్సత్తువ ఆవరిస్తుంది. అవయవాలు స్వాధీనంలో ఉండవు.

తుపాకీ ఉపయోగించకుండా వాళ్ళు తమని స్వాధీనపరచుకోదలచుకున్నారని ఆమెకి అర్థమైంది. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి ఆ అడవి మధ్యలో అంత అర్థరాత్రిపూట అరిచినా ఎవరికీ వినపడదు.

ఆమె విహారికోసం చూసింది. వాళ్ళ లీడరు. అతడిని తుప్పల్లోకి తీసుకు వెళ్ళాడు. బహుశా చంపెయ్యడానికి అయి వుంటుంది.

వీళ్ళు ముగ్గురూ పిల్లల్ని వదిలి తమని ఎందుకు తీసుకువచ్చారో. వీళ్ళ రహస్యాలన్నీ తమకి ఎందుకు చెప్పారో ఆమెకు అర్థమైంది. ఈ అడవిలో తమ ఇద్దర్నీ చంపేసి పాత పగ తీర్చుకోబోతున్నారు.

ఆమె కదలబోతుంటే ఒకడు రెండు చేతులూ వెనక్కి విరిచి పట్టుకున్నాడు. మరొకడు ఆమె బుష్‌షర్టు బటన్స్ విప్పేసేడు. ఆమె నిరోధించడానికి ప్రయత్నించినా, వాళ్ళు కొట్టిన దెబ్బకి చేతులు స్వాధీనంలో లేవు నిల్చుని వున్న ఆమె ముందు మోకాళ్ళమీద కూర్చుని మరొకడు పాంటు చెరోవైపు పట్టుకుని గట్టిగా లాగాడు. ఫట్ మన్న శబ్దంతో జిప్ జారింది. ఆమె నిస్సహాయంగా నేలవాలిపోయింది. ఆమె శరీరం క్రింద ఎండుపుల్లులు విరిగాయి. అడవి పిట్ట ఒకటి దూరంనుంచి వికృతంగా అరిచింది. చెట్లకొమ్మలు వూగుతున్నాయి. అంతా నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ కొన్ని గజాల చెట్ల అవల్నుంచి పిస్తోలు మూడుసార్లు పేలిన శబ్దం, దానితోపాటు విహారి తీసుకుని వెళ్ళిన వాడి నవ్వు వినిపించాయి.

అప్పుడు మొట్టమొదటిసారిగా ఆమె కంటినుంచి నీటి చుక్కరాలింది.

విహారి....

.... అతడు ఏ రక్షణశాఖకూ సంబంధించినవాడు కాదూ, ఏ గూఢచారి సంస్థకు సంబంధించిన వాడూ కాదు. కేవలం పిల్లల్ని రక్షించడానికి వచ్చినవాడు. ఒకమ్మాయిని 'సేవ్' చేయడానికి కారు ఎక్కినవాడు. బాధ్యత తెలిసిన సాధారణ పౌరుడు. ఒక నిర్దుష్టమైన గమ్యం కోసం ప్రాణాలు అర్పించాడు.

ఈ రెండు దారుణాల్ని చూడటానికా అన్నట్టు చంద్రుడు మేఘాల చాటునుంచి బయటకు వచ్చాడు. అడవి తెల్లబడింది. వెల్లకిలా పడివున్న ఆమె మీదకు ఒకడు వంగాడు. ఆమె చేతుల్తో వక్షద్వయాన్ని కప్పుకోవడానికి ప్రయత్నం చేసింది. పక్కనున్నవాడు కాలితో ఆమె మోచేతిమీద కొట్టాడు. నరం కలుక్కుమంది. మీదకు వంగినవాడు ఆమె మెడక్రిందగా చెయ్యివేసి శరీరాన్ని పైకిలేపి వెనుకనున్న బ్రా హుక్కువిప్పి గాలిలోకి విసిరేసేడు. ఆమె మిగతా దుస్తులతోపాటూ అదీ పక్కనున్న లోయలోకి జారిపోయింది. తల దగ్గిర కూర్చున్నవాడు ఆమె చేతుల్ని కదలకుండా పట్టుకున్నాడు.

ఆమె అరవడం లేదు.

యుద్ధంలో - మరణించేముందు ఆర్తనాదం చేయడం వీరుల లక్షణం కాదు.

గంట తర్వాత రాబోయే మృత్యువుని ఆహ్వానిస్తూ ఆమె కళ్ళు మూసుకుంది. ఆమె మీదకు వంగినవాడు భుజాలమీద చెయ్యి నెమ్మదిగా క్రిందికి జార్చి ఆఖరి ఆచ్ఛాదనను తొలగించాడు.

ఆమె తెల్లటి శరీరంమీద మరింత తెల్లగా మెరుస్తూంది.

మరో క్షణం గడిచివుంటే ఏమై వుండేదో గానీ, అప్పుడే పిస్టోల్ శబ్దం వినిపించింది.

ప్రవల్లిక మీదకు వంగబోతున్న టెర్రరిస్టు చప్పున ఆగిపోయాడు. ఇద్దరు గూండాలు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఈ శబ్దాన్ని వాళ్ళు వూహించలేదు. ఎవరు ఎవరిమీద పేల్చారో తెలియలేదు. ఎందుకంటే, అంతకుముందు వినిపించిన శబ్దంతోనే వాళ్ళ ఉద్దేశంలో విహారి మరణించి ఉండాలి.

వాళ్ళ సందిగ్ధతని ప్రవల్లిక సరి అయిన సమయానికి సరిగ్గా ఉపయోగించుకుంది. బలం అంత కళ్ళలోకి తెచ్చుకుని తనన్ని పట్టుకున్న వ్యక్తి మొహం మీద కొట్టింది. అతడి చెతుల్లోంచి తప్పించుకుంటూ ఉండగా రెండోవాడు తిరిగి పట్టుకోబోయాడు.

అప్పుడు పేలింది వెనుకనుంచి పిస్తోలు చాతీనుంచి గుండు దూసుకుపోయింది. రక్తం చిమ్ముతుండగా టెర్రరిస్టు వెనక్కు విరుచుకుపడిపోయాడు. అ పడటంలో కాలుజారి లోయలోకి కూలిపోయాడు అతడు పెట్టిన ఆర్థనాదం అడవిలో ప్రతిధ్వనించింది.

విహారి మళ్ళీ ఇంకోసారి పేల్చాడు. అయితే ఈసారి బుల్లెట్ ప్రత్యర్థి పక్కనుంచి దూసుకుపోయింది. ఊహించని దాడితో ఆ మిగిలిన ఒక్క ప్రత్యర్థీ బెదిరిపోయాడు. ప్రవల్లిక ఒక్కతే అన్న ఉద్దేశ్యంతో ఆయుధాలు కూడ దగ్గిర వుంచుకోలేదు. వాడి కళ్ళముందే సహచరులు మరణించడంతో అతడు ధైర్యం కోల్పోయాడు. విహారి మరోసారి గురి చూసి పేల్చేలోపులో తుప్పల్లోకి పరుగెత్తి అదృష్యమయ్యాడు.

విహారి వంటిమీద ఒక షర్టు తప్ప మరేమీలేదు అదైనా అదృష్టవశాత్తు చెట్టుకొమ్మల్లో దొరికింది.

అసలతను బ్రతికి బయట పడటమే ఒక అదృష్టం.

రామ్‌లాల్ సాడిస్టిక్‌గా అతడితో ఆడుకున్నాడు. నిజం నిజం చెప్తే వదిలేస్తాను. చెప్పు కాలుస్తానా కాల్చనా? అని ఒకసారి నిజం చెప్పవు అందుకే కాల్చలేదు. చెప్పు ఈ సారి నిన్ను కాలుస్తానా? గాలిలోకి పేలుస్తానా? అని మరోసారి ఇలా ప్రాణాల్తో ఆడుకోసాగాడు

అయితే అతడు గాలిలోకి పేల్చినప్పుడు చెట్టుమీద ఉన్న గ్రద్దకి ఆ బుల్లెటు తగలడం అది నేల కూలడం అతడు గమనించలేదు. దాని జంట రెక్కలు సాచి గాలిలోకి రివ్వున ఎగిరింది. కసితో కోపంతో ప్రచండ వేగంతో దాని రెక్కలు టపటపా కొట్టుకున్నాయి.

ఆ సమయానికి రామ్‌లాల్ గట్టిగా నవ్వుతూ గోడమీద నుంచి నా మీదకి ఎలా దూకావు? ఇలా కదూ ..... అంటూ అక్రోబాటిక్స్ చేసి చూపిస్తూ మరోసారి (ఈసారి నిజంగానే) విహారిని షూట్ చేయబోయే సమయానికి గాలిలో విసురుగా వచ్చి అతడి నుదుటిమీద బలంగా కాళ్ళతో కొట్టింది.

రామ్‌లాల్ ఈ హఠాత్ చర్యకి విస్తుబోయాడు. ఎంతటివాడినైనా భయకంపితుడ్ని చేసే చర్య అది. అతడి కుడి కంటినుంచి రక్తం కారసాగింది. పిస్టల్‌ని అనాలోచితంగా వదిలేశాడు. బాధతో [illegible]

విహారి ఆ అవకాశాన్ని వదులుకోలేదు. వేగంగా వెళ్ళి పిస్తోల్ అందుకున్నాడు. అయితే రామ్‌లాల్ ఆ సంగతి గ్రహించే చురుగ్గా అక్కడి నుంచి పరుగేత్తాడు. కళ్ళు కనపడని స్టేజిలో తుప్పల్లో అడ్డదిడ్డంగా పరుగెత్తి అదృష్యమయ్యాడు.

విహారి అతడి గురించి పట్టించుకోలేదు. ప్రవల్లిక ఏమైందా అన్న ఆందోళనతో వెతుక్కుంటూ వచ్చాడు. అతడి వంటిమీద షర్టు మాత్రం వేసుకున్నాడు. ప్రాబ్లం యుక్తాయుక్తాలకన్నా పెద్దది. అతడు వచ్చే సమయానికి ప్రవల్లిక శారీరక స్థితికూడ దాదాపు అలాగే వుంది. ఆమె కూడ దొరికిన అచ్చాదనను కప్పుకుంది. కానీ అది చాలా చిన్నది

మృత్యువు ఎంత సమీపంలోకి వచ్చిందో అంత తొందరగా వెళ్ళిపోయింది.

చుట్టూ అడవి.

తీసుకొచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు ప్రాణాల్తో ఇద్దరు పారిపోయారు. మృత్యువు ఒకడిని తీసుకు వెళ్ళింది. విహారి ప్రవల్లిక ఇద్దరే మిగిలారు. ప్రాణగండం తప్పిపోయిందని తెలియగానే మామూలు భావాలు తిరిగి చోటుచేసుకున్నాయి. విహారి చప్పున మొహం తిప్పుకున్నాడు ప్రవల్లిక సిగ్గుతో పోదచాటుకి పరుగెత్తింది. ఆమె జీవితంలో ఎప్పుడు అంత సిగ్గుపడలేదు. మొహం ఎర్రగా కందిపోయింది. చేతులు రెండూ భుజాలకి అడ్డుపెట్టుకుని అరక్షణంలో అదృష్యమైంది కానీ ఆ అరక్షణమే ఆ ఆడవిలో ఒక మెరుపుతీగ ఉజ్జ్వలంగా మెరిసి మాయమైనట్టు అనిపించింది

విహారి పరిస్థితి అంత ఘోరంగా లేదు. అతడికి కనీసం బుష్ షర్టు వుంది.

అతడికేమి చెయ్యాలో తోచలేదు.

ప్రవల్లిక వెళ్ళిన వైపు చూశాడు అక్కడ పొదలు నిశ్చలంగా వున్నాయి ఆమె అక్కణ్నుంచి బయటికి రాలేదని ఏవో ఒక బట్టలు వెతకవలసిన బాధ్యత తనదేనని అతడు గ్రహించాడు.

తమ బట్టలు మొత్తం లోయలోకి విసిరివేయడం అతడు చూశాడు అదృష్టవశాత్తు తన చొక్కా మాత్రం దొరికింది. అది ఆమె కిచ్చేస్తే తన కేమీ వుండదు.

లోయలో పడిన టెర్రరిస్టు శరీరం కోసం అతడు వంగి చూశాడు. దూరంగా క్రింద ఎక్కడో అస్పష్టంగా కనిపిస్తూంది. అక్కడివరకూ దిగివెళ్ళి తీసుకురావడం తప్ప మరో మార్గం లేదు. కానీ రిస్కు తీసుకోకపోతే ఈ అడవి నుంచి తామిద్దరూ అడమ్ అండ్ ఈవ్‌లలాగా నాగరిక ప్రపంచంలోకి వెళ్ళాలి.

ప్రవల్లికని సలహా అడుగుదామా అనుకున్నాడు. కానీ ఆమె మాత్రం ఏం చెపుతుంది? లోయలోకి దిగొద్దు ఆకులు కట్టుకుని బయల్దేర్దాం అనదు కదా.